తైబజార్ వసూలు చేయొద్దు

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 31 : చిరు వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో తైబజార్ వసూలు చేయడం లేదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీకి వస్తున్న ఆదాయాన్ని మరింత పెంచుకునేందుకు ఇతర మార్గాల ద్వారా సేకరించి నిరుపేదలకు ఇబ్బందులు కాకుండా చూస్తామన్నారు.

సిరిసిల్ల, గజ్వేల్‌లో భారీ ఎత్తున అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. ఆ ప్రాంతాల మాదిరిగా మహబూబ్‌నగర్‌ను అభివృద్ధి చేసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, ఎన్పీ వెంకటేశ్, బెనహర్ తదితరులు ఉన్నారు.

రేవంత్.. వ్యక్తిగత దూషణలు మానుకో

- సీఎంగా ఉండి ఇష్టానుసారం మాట్లాడడం సరికాదు
- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

కాంగ్రెస్ కరపత్రాన్ని చూపిస్తున్న డీకే అరుణ

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 31 : రేవంత్‌రెడ్డి సీఎం కుర్చీలో ఉండి కూడా గల్లీ నాయకుడిలా మాట్లాడడం విచారకరమని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ని ఆమె నివాసంలో మాట్లాడారు. అధికారం ఉందని నోటికొచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. గద్వాల దొరసాని అంటూ వ్యక్తిగతంగా విమర్శలు చేయడాన్ని తప్పుబడుతూ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మీ ఇంట్లో ఆడవారిని ఇలానే మాట్లాడుతావా అంటూ ప్రశ్నించారు. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి మహిళలకు ఇచ్చే మర్యాద ఇదేనా అంటూ నిలదీశారు. సీఎం అనే సోయి లేకుండా ప్రతిపక్షనేతగానే మాట్లాడుతున్నారని విమర్శించారు. బీజేపీ పార్టీని విమర్శించే రేవంత్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఉన్న ఓట్లు చాలా తక్కువని, ఎన్ని కోట్లు పంచి గెలవాలని చూస్తున్నారో మాకు తెలుసన్నారు. లమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచే సత్తా కాంగ్రెస్‌కు లేదని, ఆ పార్టీ గెలిస్తే కనీసం ప్రధాని ఎవరో కూడా స్పష్టత లేని పరిస్థితుల్లో ఉందన్నారు.

సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అరుణను ఆదరించాలి..

ఊట్కూర్, మార్చి 31 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ మంత్రి డీకే అరుణమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని గద్వాల మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డి ఓటర్లను కోరారు. ఆదివారం ఊట్కూర్, నిడుగుర్తి గ్రామాల్లో ముఖ్య నాయకులు, కార్యకర్తలను కలిసి ప్రచారం చేశారు.

లోక రక్షకుడు యేసుక్రీస్తు

దేవరకద్ర రూరల్ : చింతకుంటలో పాల్గొన్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

పాలమూరు/దేవరకద్ర రూరల్/జడ్చర్ల, మార్చి 31 : లోక రక్షకుడు యేసుక్రీస్తు అని, ఆయనను శిలువ వేసిన తర్వాత తిరిగి మూడు రోజుల తర్వాత సమాజ శ్రేయస్సు కోసం తిరిగొచ్చారని పాస్టర్లు చెప్పారు. ఈస్టర్ సందర్భంగా మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శిలువతో కల్వరి కొండకు వెళ్లి ఆరాధన, ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు దేవుని సందేశాన్ని చదివి వినిపించారు. ప్రతి ఒక్కరూ సేవ, దయ, కరుణ, ప్రేమ కలిగి జీవించాలని సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి డీకే అరుణ వేడుకల్లో పాల్గొన్నారు. అదేవిధంగా చిన్నచింతకుంట, కౌకుంట్ల మండల కేంద్రాలతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం క్రైస్తవులు చర్చీల్లో ఈస్టర్ పర్వదిన వేడుకలను నిర్వహించారు. చింతకుంట మండల కేంద్రంలోని ఎంబీ జాయిన్ చర్చిలోని ర్వహించిన ఈస్టర్ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి పాల్గొని క్రైస్తవులతో కలిసి ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే యునైటెడ్ క్రిస్టియన్ ఆధ్వర్యం లో ఆదివారం జడ్చర్లలోని క్లబ్‌రోడ్డులో గల కల్వరికొండపైకి వెళ్లి క్రైస్తవులు ఆరాధన, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జయయేసుకుమార్ దైవ సందేశమిచ్చారు.

ఇఫ్తార్ విందులో..

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 31 : సామాజికవేత్త జఫరుల్లా సిద్ధిఖీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏనుగొండలో గల జేజేఆర్ ఫంక్షన్‌హాల్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, మాజీ మంత్రి డీకే అరుణ, ఇంతియాజ్‌ఇసాక్, మిథున్‌రెడ్డి హాజరయ్యారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

నర్వ, మార్చి 31 : రైతులు తీసుకున్న పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు సకాలంలో చెల్లించి సింగిల్ విండో సొసైటీ అభివృద్ధికి సహకరించాలని విండో అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నర్వ విండో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రుణాలు సకాలంలో చెల్లిస్తే రైతులకు, సొసైటీకి మేలు జరుగుతుందన్నారు. సొసైటీ ద్వారా నూతనంగా రైస్‌మిల్ నిర్మాణం చేపట్టేందుకు తీర్మానం చేశారు. సమావేశంలో సభ్యులు వివేకానందరెడ్డి, లింగన్న, శేఖర్, బుచ్చన్న, శ్రీనివాస్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సీఈవో ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ధన్వాడ, మార్చి 31 : హమాలీ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన హమాలీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హమాలీల సంక్షేమానికి సంక్షేమబోర్డు ఏర్పాటు చేసి, ప్రమాదవశాత్తు మృతిచెందిన కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. 50ఏండ్లు దాటిన హమాలీలకు రూ.5వేల పింఛన్ ఇవ్వాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కతలప్ప, ఉపాధ్యక్షుడిగా బాలస్వామిని ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు మల్లేశ్, రాము, గోవిందు, కురుమయ్య, ఆంజనేయులు, బాలనర్సింహులు తదితరు లు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ ఫెడరేషన్‌ను..

మరికల్, మార్చి 31 : నాయీబ్రాహ్మణుల సంక్షేమం కోసం ఫెడరేషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరమున్నదని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయీబ్రాహ్మణ ఫెడరేషన్‌ను ఏర్పాటు చేసి న్యాయం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు రఘు, చంద్రశేఖర్, రాయుడు, వేణుగోపాల్, బీసన్న, ఈశ్వర్, నరేశ్, అశోక్‌కుమార్, బాలరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలు ఘనంగా నిర్వహించాలి

నారాయణపేట టౌన్, మార్చి 31 : శ్రీరామనవమి, హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని వీహెచ్‌పీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. ఆదివారం పట్టణంలోని శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం పలువురికి బాధ్యతలు అప్పగించారు.

7న ఉగాది కవి సమ్మేళనం

పాలమూరు, మార్చి 31 : ఉగాది పండుగను పురస్కరించుకొని లుంబినీ పాఠశాల, పాలమూరు సాహితీ ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు పాలమూరు సాహితీ అధ్యక్షుడు భీంపల్లి శ్రీకాంత్ తెలిపారు. ఈనెల 7వ తేదీన ఉదయం 10గంటలకు జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో గల లుంబినీ పాఠశాలలో నిర్వహించే సమ్మేళనానికి పాఠశాల డైరెక్టర్ కె.లక్ష్మణ్‌గౌడ్ అధ్యక్షతన ప్రముఖ సంపాదకులు మణికొండ వేదకుమార్, విశిష్ట అతిథులుగా ప్రముఖ న్యాయవాది మనోహర్‌రెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ రఘు, ఆత్మీయ అతిథిగా కాళోజీ అవార్డు గ్రహీత వెంకటేశ్వర్‌రెడ్డి హాజరవుతారన్నారు.

ప్రహరీ నిర్మించాలి

ఊట్కూర్, మార్చి 31 : మండలంలోని పులిమామిడి-జక్లేర్ గ్రామాల మధ్య రైల్వే ట్రాక్ పక్కనే ప్రమాద భరితంగా ఉన్న నీటి గుంతకు చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాలని తెలంగాణ విద్యావంతుల వేదిక ఉమ్మడి పాలమూరు జిల్లా సమన్వయకర్త బిజ్వారం మహేశ్‌గౌడ్ ఆదివారం ప్రకటనలో కోరారు. రైల్వే ట్రాక్ నిర్మాణ పనుల్లో భాగంగా గుత్తేదారులు మట్టి కోసం ట్రాక్ పక్కనే గుంత తవ్వడంతో వాహనదారులతోపాటు పశువులకు ప్రమాదం పొంచి ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

దామరగిద్ద, మార్చి 31 : మండల కేంద్రంలో ఆదివారం దామరగిద్ద ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ పోటీలను అద్దన్ కన్కిరెడ్డి ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.50వేలు దాత వన్నాడి వెంకటప్ప, రెండో బహుమతి రూ.25వేలను దాత అద్దన్ కన్కిరెడ్డి అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే క్రీడాకారులకు టీ షర్ట్‌లను అందజేశారు. కార్యక్రమంలో రవి, రమేశ్, మాణిక్యప్ప, తులసీరామ్ పాల్గొన్నారు.

నేటి నుంచి తైబజార్ చెల్లించొద్దు

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 31 : పురపాలికలోని చిరువ్యాపారులు నేటి నుంచి తైబజార్ చెల్లించవద్దని మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 31తో తైబజార్ వేలం ము గిసిందని, ఇక నుంచి ఎవరూ చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి

అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై ఆంజనేయులు

నారాయణపేట, మార్చి 31 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏఎస్సై ఆంజనేయులు సూచించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డు నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే లింకులను ఓపెన్ చేయరాదన్నారు. ఆన్‌లైన్ రుణ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోరాదన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930, డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటుపడితే శారీరక, మానసికంగా బలహీనులై ఆర్థిక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నారాయణ, కానిస్టేబుల్ శివ, మహిళా కానిస్టేబుల్ సృజన పాల్గొన్నారు.

అంటరానితనం నిర్మూలనకు కృషి

చట్టాలు, హక్కులపై అవగాహన కల్పిస్తున్న పోలీస్, రెవెన్యూ అధికారులు

నారాయణపేట, మార్చి 31 : గ్రామాల్లో నెలకొన్న అంటరానితనం, అసమానతలు, కులవివక్షను నిర్మూలించేందుకు కృషి చేయాలని పోలీసులు, రెవెన్యూ అధికారులు తెలిపారు. జిల్లాలోని పలు గ్రామాల్లో ఆదివారం పౌరహక్కుల దినోత్సవం(సివిల్ రైట్స్ డే) నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కులాల వారిని చైతన్యపర్చేందుకు, వారిని అభివృద్ధి వైపు నడిపించేందుకు పోలీస్‌శాఖ, రెవెన్యూ అధికారులతో కలిసి పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ, 1989 చట్టం, ఫోక్సో, పౌర హక్కుల రక్షణ తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. కులమతాల తేడా లేకుండా కలిసికట్టుగా ఉండాలన్నారు.

ఆలయ నిర్మాణానికి దాతల ఆర్థిక సాయం

మూసాపేట, మార్చి 31 : మండల కేంద్రంలోని రామస్వామి గుట్టపై శ్రీ రాముడు ప్రతిష్ఠించిన రామలింగేశ్వరస్వామి ఆలయ పునర్ నిర్మాణానికి ఆదివారం దాతలు ఆర్థిక సహయం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన టెస్లో గ్లోబల్ సర్వీస్ ఐటీ మేనేజర్ ముగినంటి సంతోష్‌చారి రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్ నిర్మాణానికి రూ.51,116లు ఆలయ కమిటీ చైర్మన్ నరేందర్‌సాగర్‌కు అందజేశారు. అదేవిధంగా టెలికం ఇండియా సంస్థ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ హెడ్ జెడ్‌టీఈ మెరుగు శరత్‌కుమార్‌రెడ్డి రూ.31,116లు అందజేశారు. రంగారెడ్డి జిల్లా మేడ్చల్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మాదాస్ నాగరాజు రూ.10,116లు అందజేశారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రాఘవేందర్‌రెడ్డి, అస్కని శ్రీహరి పాల్గొన్నారు.

అనాథలకు చేయూతనివ్వాలి

స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మార్చి 31 : అనాథ విద్యార్థులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకురావాలని రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్యాముల్ పిలుపునిచ్చారు. మ్యాన్‌కైండ్ ఫార్మా లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం రెడ్‌క్రాస్ అనాథాశ్రమ విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, విద్యా సామగ్రి, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు రమణయ్య, కోశాధికారి జగపతిరావు, యూత్ రెడ్‌క్రాస్ సమన్వయకర్తలు అశ్విని చంద్రశేఖర్, ఓబుల్‌రెడ్డి, మేనేజర్ నర్సింహ, మ్యాన్ కైండ్ ఫార్మా లిమిటెడ్ ప్రతినిధులు రాజ్‌కుమార్, శివకుమార్, విద్యార్థులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

2న పీయూలో క్యాంపస్ డ్రైవ్

పాలమూరు, మార్చి 31 : జిల్లా కేంద్రం సమీపంలోని పాలమూరు విశ్వవిద్యాలయంలో ఏప్రిల్ 2వ తేదీన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. విజయ బయో ఫర్టిలైజర్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో రిలేషన్‌షిప్ మేనేజర్లు, ఆర్ఎం ఉద్యోగాల కోసం ఉద్యోగమేళా ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులకు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు ఉండనున్నట్లు తెలిపారు. ఈ ప్లేస్మెంట్‌డ్రైవ్ ఉదయం 10గంటలకు అకాడమిక్ ఆడిటోరియం వద్దకు చేరుకోవాలని, అలాగే అభ్యర్థులు బయోడేటాతోపాటు సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

చెత్తరహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం

- మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్

శేషాద్రినగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ ఆనంద్‌గౌడ్

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 31 : చెత్తరహిత పట్టణంగా తీర్చిదీద్దుదామని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లోని 21వ వార్డు శేషాద్రినగర్‌లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డులో నెలకొన్న సమస్య ల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆయా వార్డుల ప్రజలు ఇంటి నుంచి వెలువడే చెత్త ను రోడ్లు, డ్రైనేజీల్లో వేయవద్దని సూచించారు. తడి,పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోకు అందజేయాలని కోరారు. పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టాలని సిబ్బందికి సూచించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు.

ఆస్తిపన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

ఆస్తి పన్ను డ్రైవ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

- మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ టౌన్, మార్చి 31 : ఆస్తి పన్ను చెల్లించి పుర అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆస్తిపన్ను వసూలు డ్రైవ్‌లో భాగంగా ఆదివారం పట్టణంలో ఆస్తి పన్ను ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 వరకు పెండింగ్ బకాయిలు ఉన్న వారికి 90శాతం వడ్డీమాఫీ కల్పించామని తెలిపారు. వార్డుల్లో ప్రత్యేక బృందాలు రాత్రి వరకు పన్ను వసూలు చేశారు. దాదాపు చివరి రోజు రూ.60లక్షల వరకు ఆస్తి పన్ను వసూలు చేశారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జడ్చర్ల(బాలానగర్), మార్చి 31 : బాలానగర్ మండలం గౌతాపూర్ గ్రామం వద్ద ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై తిరుపాజీ తెలిపారు. రాజాపూర్ మండలం మల్లేపల్లి వద్ద గల దుందుభీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా బాలానగర్ మండలానికి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుండగా బాలానగర్ పోలీసులు గౌతాపూర్ వద్ద ఆదివారం మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఓనర్లు, డ్రైవర్లు ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

కవులు, కళాకారులకు ఉగాది పురస్కారాలు

పురస్కారాలను అందజేస్తున్న న్యాయవాది మనోహర్‌రెడ్డి

పాలమూరు, మార్చి 31 : కురుమూర్తి దేవస్థానం ఆధ్వర్యంలో బెల్లం సత్యమ్మ నిర్వహణలో ఆదివారం చిన్నచింతకుంట మండలం కురుమూర్తి దేవస్థానం వద్ద ఉమ్మడి పాలమూరు జిల్లా కవులు, కళాకారులకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ న్యాయవాది మనోహర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎంతోమంది కవులు, కళాకారులు ఉన్నారని, వారిని ప్రోత్సహించేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం బెల్లం సాయిలు గొప్పతనమని కొనియాడారు. కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి మదనేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ తాసీల్దార్ సునీల్‌కుమార్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏఐడేఎస్ వర్క్‌షాప్‌లో జేసీఎన్‌సీఈ విద్యార్థులు

వర్క్‌షాప్‌లో పాల్గొన్న జేపీఎన్‌సీఈ విద్యార్థులు

పాలమూరు, మార్చి 31 : హైదరాబాద్‌లోని జేఎన్టీయూహెచ్‌లో ఏఐడేఎస్ అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ జయప్రకాశ్ నారాయణ్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో కళాశాల విద్యార్థులు అమీనా, అష్, పాయల్, ప్రీతి, మేహ్విాశ్ బహుమతులు సాధించారు. ప్రతిభ కనబర్చిన వారిని కళాశాల చైర్మన్ రవికుమార్ అభినందించారు.

మద్యం పట్టివేత: కేసు నమోదు

ఉండవెల్లి మార్చి 31: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకున్నది. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఉండవెల్లిలోని అనసూయమ్మ కాలనీకి చెందిన వెంకటేశ్వర్‌గౌడ్ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నాడనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా.. ఆరు బీరు సీసాలు, 29 క్వాటర్ సీసాలు ఉన్నట్లు గుర్తించడం జరిగింది. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వెంకటేశ్వర్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మిర్చి వాహనానికి తప్పిన ప్రమాదం

అయిజ, మార్చి 31: పట్టణంలోని కత్తిమాన్యం సమీపంలో మిర్చి వాహనం ప్రమాదం నుంచి బయటపడింది. ఆదివారం పట్టణానికి చెందిన రైతులు వీరేశ్, గోపి, సత్యారెడ్డి, గోపాల్ మిర్చి పంటను కర్ణాటకలో విక్రయించేందుకు బొలెరోలో తరలించేందుకు బయలుదేరారు. కత్తిమాన్యం చౌరస్తా సమీపంలో ఇంటి పునాది కోసం తవ్విన మట్టిలో వాహనం అదుపు తప్పి ఇరుక్కుపోయింది. దీంతో వాహనం పక్కకు ఒరిగిందని గ్రహించిన రైతులు అప్రమత్తమై వాహనానికి కర్రలు సపోర్టు పెట్టి ప్రమాదం నుంచి గట్టెక్కించారు. వాహనం కిందకు పడిపోతే మిర్చి రోడ్డు పాలయ్యేదని రైతులు ఆవేదన చెందారు. మిర్చి వాహనం ప్రమాదం నుంచి బయటపడడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

రైలు ఎక్కబోతే తెగిపడిన చేయి

ఆత్మకూర్, మార్చి 31: కదులుతున్న రైలును ఎక్కబోయిన ఓ వ్యక్తి కాలు జారిపడి ఎడమచేతిని పోగొట్టుకున్నాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకున్నది. అప్రమత్తమైన ప్రయాణికులు 108కు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి వెళ్లి ప్రథమ చికిత్స అందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు తరలించారు. జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన గోపాల్‌నాయుడు శ్రీరాంనగర్ రైల్వేస్టేషన్‌లో ఉదయం 10గంటలకు హైదరాబాద్ నుంచి డోన్ వెళ్తున్న లోకల్ రైలును కదులుతుండగా ఎక్కబోయి కాలు జారి కింద పడిపోగా, ఎడమచేతి పూర్తిగా విరిగిందని అంబులెన్స్ పైలట్ తెలిపారు.

రక్తదానం చేసిన బ్యాంక్ ఉద్యోగులు

రక్తదానం చేస్తున్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులు

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మార్చి 31 : ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ఆరాధ్యుడు కామ్రేడ్ దిలీప్‌కుమార్ ముఖర్జీ 11వ వర్ధంతి సందర్భంగా ఆదివారం మహబూబ్‌నగర్‌లోని రెడ్‌క్రాస్ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. బ్యాంకు ఉద్యోగులు 52 మంది రక్తదానం చేశారు. అనంతరం దిలీప్‌కుమార్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బ్యాంకు సంఘం అధ్యక్షుడు కామ్రేడ్ బి.రవికాంత్, రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్, బ్యాంకు అధికారుల సంఘం అధ్యక్షుడు మక్కడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

అయిజ, మార్చి 31: అయిజ పట్టణంలోని రాయిచూర్ రోడ్డులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన చోటు చేసుకున్నది. కుటుంబీకుల కథనం ప్రకారం.. గట్టు మండలంలోని చిన్నోనిపల్లికి చెందిన గోవిందమ్మ (65) మనవరాలిని ప్రసవం నిమిత్తం అయిజలోని ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. ఆమెను చూసేందుకు మనుమడు రాజుతో కలిసి ద్విచక్రవాహనంపై చిన్నోనిపల్లి నుంచి అయిజకు బయలుదేరారు. అయిజ పట్టణానికి సమీపంలోని పెట్రోల్ పంపు వద్ద వాహనం అదుపుతప్పి కిందపడింది. దీంతో గోవిందమ్మ తలకు బలమైన గాయం కావడంతో కర్నూల్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఆమెకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.